### కొత్త మున్సిపాలిటీకి

# చిలుకూరు బాలాజీ పేరు పెట్టాలి

**రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డికి లేఖ రాసిన చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి**



కలెక్టర్‌కు ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి రాసిన లేఖను అందిస్తున్న చిలుకూరు గ్రామస్తులు

మొయినాబాద్, డిసెంబర్ 28 : ప్రభుత్వం ఏర్పాటు చేయదలచిన మొయినాబాద్ మున్సిపాలిటీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన చిలుకూరు బాలాజీ పేరు పెట్టాలని.. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రాసిన లేఖను గ్రామానికి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు శనివారం రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డికి అందించారు. మొయినాబాద్ మున్సిపాలిటీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చినదని.. అయితే చాలా గ్రామాల ప్రజలు మున్సిపాలిటీలో విలీనమయ్యేందుకు ఇష్టపడడం లేదని.. మెజార్టీ ప్రజల అంగీకారంతో మున్సిపాలిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంటే దానికి చిలుకూరు బాలాజీ పేరు పెట్టాలని సూచించారు. ఈ ప్రాంత ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకొని సమాజం, విలువలు, ఆకాంక్షలు ప్రతిబింబించేలా మున్సిపాలిటీకి చిలుకూరు బాలాజీ పేరు పెట్టాలని కోరారు. ఎంపీ ఇచ్చిన లేఖతోపాటు చిలుకూరు గ్రామస్తులు కూడా మున్సిపాలిటీకి చిలుకూరు బాలాజీ పేరే పెట్టాలని కలెక్టర్‌కు మరో వినతి పత్రాన్ని అందించా రు. వినతిపత్రమిచ్చిన వారిలో మాజీ ఉపసర్పంచ్ గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సహదేవ్, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు శ్రీరాములు, నాయకులు నరేందర్, మహేశ్‌చారి, సంతోష్, సంపత్ ఉన్నారు.



### రెవెన్యూ సమస్యలపై

# నిర్లక్ష్యం తగదు

వికారాబాద్, డిసెంబర్ 28 : రెవెన్యూ సమస్యలపై నిర్లక్ష్యం తగదని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు భూమి లభ్యత, పాత ధాన్యం సేకరణ, ధరణి పెండింగ్ తదితర అంశాలపై తహసీల్దార్లు, రెవెన్యూ సంబంధిత సూపరింటెండెంట్లతో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిష్కృతంగా ఉన్న భూముల సమస్యలను పరిష్కరించాలన్నారు. పీహెచ్‌సీల ఏర్పాటుకు గుర్తించిన భూముల వివరాలను సమర్పించాలని, ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు సంబంధించిన భూములను గుర్తించడంతోపాటు ప్రతిపాదనలు సమర్పించాల న్నారు. విద్యాసంస్థలకు పంపించే బియ్యం లభ్యత, నాణ్యత, బియ్యం నిల్వ గోదాములు, రేషన్ షాపులను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో వాసుచంద్ర, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామ్‌రెడ్డి, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

**గురుకులాల్లో ప్రవేశానికి ..**

గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షకు ఫిబ్రవరి 1 లోపు ఆన్‌లైన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే ఏడాదికి ఐదోతరగతిలో గురుకులాల్లో ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు రూ.100 చెల్లించాలన్నారు. మీ సేవలో దరఖాస్తుకు వీలు కాని వారు స్థానికంగా ఉండే సాంఘిక సంక్షేమ గురుకులాల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం**

### అంబానీ, అదానీలకు..

# కేంద్రం కొమ్ముకాస్తున్నది

ఇబ్రహీంపట్నం రూరల్, డిసెంబర్ 28 : కేంద్రంలోని బీజేపీ సర్కారు అంబానీ, అదానీలకు కొమ్ముకాస్తూ దేశాన్ని లూటీ చేస్తున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లా 10వ మహాసభల సందర్భంగా శనివారం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు సీపీఎం కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షాను చట్టసభల నుంచి తొలగించకుండా బీజేపీ ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నదో దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం కేంద్రీకృత పాలన విధానాన్ని అమలు చేయాలన్న ఉద్దేశంతోనే జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకొచ్చిందని, ఈ విధానంతో ఫెడరల్ వ్యవస్థ ఖూనీ అవుతుందన్నారు. అలాగే, రాష్ట్రంలో అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు, సమగ్ర శిక్షాఅభియాన్ ఉద్యోగులు, ఆశవర్కర్లు, పంచాయతీ కార్మికులు రోడ్డెక్కారని వారి సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతా మని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యాదయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం నాయకు లు జాన్ వెస్లీ, నర్సింహారావు, సుదర్శన్, భాస్కర్, జంగారెడ్డి, సామెల్, మధుసూదన్‌రెడ్డి, జగదీశ్, శోభన్, రాజు, చంద్రమోహన్, జంగయ్య, జగన్, నర్సింహారెడ్డి, అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్, జంగయ్య, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.



## మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరిస్తామని రంగారెడ్డి డీఈవో సుశీందర్‌రావు అన్నారు. శనివారం ఆయన మండలంలోని జడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాల, కేజీబీవీ హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కేజీబీవీ హాస్టల్ విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థినుల కోసం ఆట వస్తువులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. ఆయన వెంటన ఎంఈవో సర్దార్ నాయక్, ప్రాధానోపాధ్యాయుడు సుదర్శన్, టీచర్లున్నారు. -మాడ్గుల, డిసెంబర్ 28



## కమ్ముకున్న పొగమంచు

మండలాన్ని శనివారం ఉదయం పొగమంచు కమ్మేసింది. దీంతో ఉదయం 8 గంటల వరకు కూడా వాహనదారులు లైట్లు వేసుకునే రాకపోకలు సాగించారు. రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు ఇంట్లో నుంచి బయటికి రావడానికే జంకుతున్నారు.

-కడ్తాల్, డిసెంబర్ 28

# ఆత్మజ్ఞానంతో ఆనందమయ జీవితం

- పీఎస్‌ఎస్‌ఎం గ్లోబల్ వ్యవస్థాపకురాలు పరిణతి పత్రీ
- కొనసాగుతున్న ధ్యాన మహాసభలు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన



ధ్యాన మహాయాగంలో మాట్లాడుతున్న పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి

కడ్తాల్, డిసెంబర్ 28 : ధ్యానంతో పొందే ఆత్మజ్ఞానంతో ఆనందమయ జీవితాన్ని గడపొచ్చునని పీఎస్‌ఎస్‌ఎం గ్లోబల్ వ్యవస్థాపకురాలు పరిణతి పత్రీ అన్నారు. మండల కేంద్రం సమీపంలోని మహేశ్వర మహా పిరమిడ్‌లో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం-3 మహా సభలు కొనసాగు తున్నాయి. శనివారం ఉదయం 5 నుంచి 8 గంటల వరకు సంజయ్‌కింగీ-గణేశ్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన, ప్రాతఃకాల సంగీత ధ్యానంలో పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్యానులనుద్దేశించి పరిణతి పత్రీ మాట్లాడుతూ.. తల్లిదండ్రులే గురువులైతే ఆ ఇల్లు గురుకులంతో సమానమని, పిల్లలకు చిన్నతనం నుంచే ధ్యానం నేర్పించాలన్నారు. విద్యార్థులకు సమాజంపై అవగాహన కల్పించాలన్నారు. సత్యం మాట్లాడే వారికి ధైర్యం ఉంటుందని, పుస్తక పఠనంతో ఆత్మజ్ఞానం పెంపొందుతుందన్నారు. మనలో మనం కలిసిపోవడమే ధ్యానమని, ధ్యానంతో అపారమైన జ్ఞానం లభించడంతోపాటు ఆనందమయ జీవితాన్ని గడపొచ్చునని తెలిపారు. అనంతరం పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వర మహా పిరమిడ్ అభివృద్ధిలో వ్యవస్థాపక సభ్యుడు లక్ష్మణ్‌రావు ముఖ్య పాత్ర పోషించారని తెలిపారు. అనంతరం ధ్యాన గురువులు రచించిన ఆధ్యాత్మిక పుస్తకాలను విజయభాస్కర్‌రెడ్డి, పరిణతి పత్రీ ఆవిష్కరించారు. అంతకుముందు ఆసిఫాబాద్, ములుగు, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాలకు చెందిన పలువురు మాస్టర్లు తమ సందేశాలు, ధ్యాన అనుభవాలను వివరించారు. సాయంత్రం ప్రధాన వేదికపై కొత్తగూడెనికి చెందిన కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, పారిశ్రామికవేత్త లక్ష్మారెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్, మధుసూదన్‌రెడ్డి, రామకృష్ణ, నర్సింహ, సురేశ్, మీడియా కో-ఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు సాంబశివరావు, బాలకృష్ణ, హనుమంతురాజు, దామోదర్‌రెడ్డి, శ్రీరాంగోపాల్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఆడపిల్లలకు

## ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలి

**చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వెంకటేశం**



సమావేశంలో మాట్లాడుతున్న చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వెంకటేశం

వికారాబాద్, డిసెంబర్ 28 : బాలికల స్వతంత్రత కోసం గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేయాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వెంకటేశం సూచించారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని రైల్వే కమ్యూనిటీ హాల్లో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య జిల్లా యువ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ.. బాలికల స్వతంత్రత కోసం గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేయాలని.. ఆడపిల్లలకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలన్నారు. జెండర్ అసమానతలను తొలగించాలంటే బాలికలు ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. ఎస్‌ఐ విమల మాట్లాడుతూ.. సమాజంలో అవకాశాలను మనమే సృష్టించుకోవాలని, సమస్యలను పరిష్కరించుకుంటూ ముం దుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ భాస్కర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటస్వామి, జ్యోతి, వనమాల, రాజూనాయక్, రాందాస్ పాల్గొన్నారు.

**రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ మురళి**

### ప్రభుత్వ బడులను

# విద్యార్థుల తల్లిదండ్రులే పర్యవేక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ మురళి

మంచాల, డిసెంబర్ 28 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, సమగ్ర ప్రణాళికే లక్ష్యంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలని రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్, మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి అన్నారు. శనివారం మండలంలోని ఆరుట్ల జిల్లా పరిషత్ పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయన మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు విద్యార్థుల తల్లిదండ్రుల సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలను నిరంతరం విద్యార్థుల తల్లిదండ్రులే పర్యవేక్షించాలని.. ఎక్కడ ఏ చిన్న సమస్య ఉన్నా ఉపాధ్యాయులను అడిగే హక్కు తల్లిదండ్రులకు ఉందన్నారు. వంద రోజుల్లో ఆరుట్ల ప్రభుత్వ పాఠశాల రూపురేఖలను మార్చుదామన్నారు.

**పాఠశాల అభివృద్ధి కమిటీ ఎన్నిక..**

ఆరుట్ల పాఠశాల తల్లిదండ్రుల అభివృద్ధి కమిటీని రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ సమక్షంలో 23 మందితో ఎన్నుకున్నారు. సభ్యులుగా ఇంద్రోజు మాధవి, ఆందోజు చామంతి, జోగు జ్యోతి, చీరాల సంతోష, అనగల్ల సంతోష, మాడుపాకుల పార్వతి, కృష్ణవేణి, అనగల్ల దేవరాజ్, ఎండీ జానీపాషా, లాలాగారి జంగయ్య, చిందం శ్రీశైలం, చీరాల సురేశ్, ఏర్పుల రజిత, నూకం రాజు, అనగల్ల సంధ్య, కంబాలపల్లి భాస్కర్, రామస్వామిగౌడ్, నరేశ్, ఉమాదేవి, రేఖ, అడ్వైజర్ కమిటీ సభ్యులుగా విష్ణువర్ధన్‌రెడ్డి, కావలి శ్రీనివాస్, శ్రీను, భూపాల్, కృష్ణగౌడ్, స్వాతిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో రాందాస్, ఎంపీడీవో బాలశంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరిధర్ గౌడ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఫార్మసీ పరీక్ష తేదీ ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 28 : ఓయూ పరిధిలో వాయిదా పడిన ఎంఫార్మసీ పరీక్ష తేదీని ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి చెందిన నేపథ్యంలో ఈనెల 27 న ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో ఆ రోజు జరగాల్సిన అన్ని పరీక్షలను అధికారులు వాయి దా వేశారు. ఈ పరీక్షను తిరిగి ఈనెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

## 'కబ్జాదారుల నుంచి కబేళాను కాపాడండి'

సిటీబ్యూరో: గౌలిపురా మున్సిపల్ కబేళాను కాపాడాలని, భూ కబ్జాదారులతో కుమ్మక్కైన బల్దియా అధికారులను సస్పెండ్ చేయాలని కోరుతూ ఆరెకటిక సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో శనివారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ప్రతినిధి బృందం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అధికారుల నుంచి వివరాలు తెప్పించుకుని వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తానని కమిషనర్ హామీ ఇచ్చినట్లు సీపీఎం నేత శ్రీనివాస్ తెలిపారు. 1955 నుంచి పహాణి, రెవెన్యూ రికార్డుల్లో 4.22 ఎకరాల స్థలంలో కబేళా ఉన్నట్లు స్పష్టమైన ఆధారాలున్నాయని వివరించారు. మున్సిపల్ కబేళాను కబ్జాల నుంచి కాపాడడానికి జీహెచ్‌ఎంసీ వివిధ కోర్టుల్లో ప్రయత్నిస్తున్నప్పటికీ కొందరు బల్దియా అధికారులు కుట్రపూరితంగా కబ్జాదారులకు అనుగుణంగా హైకోర్టులో అఫిడవిట్ వేయడంతో న్యాయస్థానం కబ్జాదారులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరించిన జీహెచ్‌ఎంసీ అధికారులను, స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.



గోవా మద్యాన్ని పట్టుకున్న ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు

# గోవా మద్యం స్వాధీనం

- దాని విలువ రూ. లక్ష
- న్యూఇయర్ వేడుకల కోసం తరలింపు

వికారాబాద్/తాండూరు, డిసెంబర్ 28 : న్యూఇయర్ వేడుకల కోసం రైలులో అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలు, గంజాయిని జిల్లా ఎక్సైజ్, టాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం.. కొత్త సంవత్సరం వేడుకల కోసం కొందరు గోవా నుంచి పెద్ద మొత్తంలో మద్యం బాటిళ్లను తీసుకొ స్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు వికారాబాద్ ఎక్సైజ్, టాస్క్ ఫోర్స్ పోలీసులు వాస్కోడిగామా రైల్లో తాండూరు ప్రాంత పరిధిలో శనివారం తెల్లవారు జామున తనిఖీలు చేసి 95 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ. లక్ష వరకు ఉంటుందన్నారు. అదేవిధంగా తాండూరు రైల్వేస్టేషన్‌లోని రెండో ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తులు వదిలివెళ్లిన రూ. లక్ష విలువ గల 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తనిఖీల్లో డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎక్సైజ్ ఎస్‌ఐలు ప్రేమ్‌కుమార్‌రెడ్డి, వీరాంజనేయులు, ఆర్పీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్‌బీవీఎల్ ఎండీ సరళారెడ్డి, ఎంఈవో వెంకటయ్యగౌడ్

# చదరంగంతో ఏకాగ్రత పెరుగుతుంది

- ఆర్‌బీవీఎల్ ఎండీ సరళారెడ్డి
- విన్నర్‌కు బహుమతులు అందజేత

తాండూరు, డిసెంబర్ 28 : చదరంగం మానసిక ప్రయోజనాలను అందించే మనోహరమైన క్రీడ అని ఆర్‌బీవీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సరళారెడ్డి అన్నారు. శనివారం తాండూరు పట్టణంలో హిందూ ధార్మిక్ పరిషత్, తాండూరు ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-16 పాఠశాలల స్థాయి విద్యార్థులకు చదరంగం (చెస్) పోటీలను నిర్వహించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోటీలు రసవత్తంగా సాగాయి. ఇందులో 38 పాఠశాలల నుంచి 152 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్-14 విభాగంలో నాగార్జున హైస్కూల్‌కు చెందిన షేక్ ఇబ్రహీం విన్నర్‌గా నిలిచి మొదటి బహుమతి సాధించాడు. నేతాజీ గురుదేవ్ గురుకుల్ పాఠశాలకు చెందిన భవాని శంకర్ రన్నర్‌గా.. అదేవిధంగా అండర్-16 విభాగంలో సెయింట్‌మార్క్స్ హైస్కూల్‌కు చెందిన ముతాసీం విన్నర్‌గా, విశ్వవేద హైస్కూల్‌కు చెందిన సాయిచరణ్ రన్నర్‌గా నిలిచి ద్వితీయ బహుమతి సాధించాడు. విన్నర్లుగా నిలిచిన విద్యార్థులను నిర్వాహకులు సన్మానించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌బీవీఎల్ ఎండీ సరళారెడ్డి మాట్లాడు తూ.. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు విధిగా క్రీడలు నిర్వహించాలన్నారు. చందరంగం ఆటతో విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతుం దన్నారు. ఎంఈవో వెంకటయ్యగౌడ్ మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సంస్కృతీసంప్రదాయాలను నేర్పించాలన్నారు. ఈ పోటీలకు అన్ని విధాలా సహకరించిన దాతలకు హిందూ ధార్మిక్ పరిషత్ కన్వీనర్ బస్వరాజ్, తాండూరు ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తానని మోసం

**పలువురి వద్ద డబ్బులు వసూలు...ఆలస్యంగా వెలుగులోకి..**

ధారూరు, డిసెంబర్ 28 : ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తానంటూ ఓ వ్యక్తి పలువురి వద్ద డబ్బులు వసూలు చేశాడు. ఈ ఘటన శనివారం ధారూరు ఠాణా పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. హరిదాస్‌పల్లి గ్రామానికి చెందిన చింతకుంట రాములమ్మ కొన్ని రోజుల కిందట యాలాల మండలంలోని కోకట్ గ్రామంలో ఉంటున్న తమ బంధువుల వద్దకు వెళ్లింది. అక్కడ ఆమెకు శ్రీను అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తాను కొడంగల్‌లోని ప్రభుత్వ ఆఫీసులో పని చేస్తానని నమ్మబలికాడు. పది మంది మహిళలు కలిసి గ్రూపును ఏర్పాటు చేసుకుని ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకుంటే అందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి వారి వద్ద డబ్బులు వసూలు చేశాడు. హరిదాస్‌పల్లికి చెందిన ఏర్పుల సాయమ్మ నుంచి రూ.20 వేలు, అనంతమ్మ వద్ద 13,000, పద్మమ్మ వద్ద రూ. 8,000, మున్నూసోమారం గ్రామానికి చెందిన హన్మంత్ నుంచి రూ. 30వేలు తీసుకుని కనిపించకుండాపోయాడు. దీంతో మోసపోయామని భావించిన మహిళలు ధారూరు పోలీసులకు ఫిర్యాదు చేసి.. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. శ్రీను మొబైల్‌కు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వచ్చిందని ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.

## బంగారం వ్యాపారుల్లో ఆందోళన

**గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్**

మొయినాబాద్, డిసెంబర్ 28 : మొయినాబాద్‌లోని బంగారం వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని గుర్తు తెలియని వ్యక్తులు గత ఆరు నెలలుగా ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు. ఒకసారి మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ నుంచి అంటూ.. మరోసారి జీడిమెట్ల ఠాణా నుంచి.. ఇంకోసారి విజయవాడ ఠాణా నుంచి కానిస్టేబుల్‌ను మాట్లాడుతున్న అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. బంగారం చోరీ చేసిన దొంగలు దొరికారు.. మీ వద్ద ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు బంగారం కుదువపెట్టారా..? లేదంటే అమ్మారా..? అంటూ ఆరా తీస్తున్నారు. శనివారం మధ్యాహ్నం వైష్ణవి జువెల్లర్స్ నిర్వాహకుడు అవుసుల శేఖర్‌చారి, శ్రీవేంకటేశ్వర జువెల్లర్స్ నిర్వాహకుడు అవుసుల కృష్ణమాచారిలకు ఫోన్ కాల్స్ వచ్చాయి. ఠాణాకు రావాలా అని అడిగితే వద్దు అని బెదిరిస్తూ ఫోన్ పెట్టేశారని వారు చెప్పారు. మళ్లీ ఫోన్ చేసి..సీఐకి తెలిస్తే కేసు అవుతుంది.. మీరు డబ్బులు పంపిస్తే కేసు లేకుండా చూస్తానని చెప్పినట్లు బాధితులు పేర్కొన్నారు. మూడు నెలల కిందట ఇలాంటి బెదిరింపు ఫోన్ కాల్ తనకూ వచ్చిందని కనకమామిడి గ్రామానికి చెందిన బంగారం వ్యాపారి జగదీశ్వర్‌చారి తెలిపారు. దీంతో బంగారం వ్యాపారుల్లో ఆందోళన మొదలైంది.

## గిరిజన బిడ్డకు గౌరవ డాక్టరేట్



గత 15 ఏండ్లుగా రాజూనాయక్ గ్రామానికి, పేదలకు చేసిన సేవలకు అత్యున్నత పురస్కారం వరించింది. మండలంలోని నందివనపర్తి గ్రామపంచాయతీకి అనుబంధంగా ఉన్న బొల్లిగుట్టతండాకు చెందిన వర్త్యావత్ రాజూనాయక్ ఓ నిరుపేద కుటుంబంలో జన్మించాడు. చిన్నప్పటి నుంచే సేవాభావాన్ని అలవర్చుకున్నాడు. ఎవరికీ ఏ ఆపద వచ్చినా ముందుంటాడు. అతడి సేవలను గుర్తించి తమిళనాడుకు చెందిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసర్చ్ యూనివర్సిటీ రాజూనాయక్‌కు గౌరవ డాక్టరేట్‌ను శనివారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేసింది. గిరిజన బిడ్డకు గుర్తింపు రావడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు, బీఆర్‌ఎస్ శ్రేణులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజూనాయక్ మాట్లాడుతూ..గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ పురస్కారంతో బాధ్యత మరింత పెరిగిందన్నారు.

-యాచారం, డిసెంబర్ 28